# ఒక బాకీ తీరలేదు

అప్పటికది రెండోసారి - అతను ఆ సందు చివరిదాకా నడిచి, తిరిగి వెనుకకు మళ్ళటం. వైశాఖ మాసపు ఎండ. వీధిలో మనుష్య సంచారం అతి స్వల్పం. మెదమీది నుండి ధారగా కారుతున్న స్వేదాన్ని అదేపనిగా చేతిగుడ్డతో తుడుచుకొంటున్నాడుగాని, శరీరానికి అతుక్కుపోయిన షర్టును ఏం చేయగలడు? పడమటి గాలి ప్రతాపం ఇంకా ప్రారంభం కాలేదు.

రెండు రిక్షాలు ఎదురైతే తప్పుకోలేని సందు. ఇరువైపులా, ఆంధ్ర దేశపు అన్ని బస్తీల్లోనూ దర్శనమిచ్చే మురుగు కాలువలు. ఆ పాత పెంకుటింటి ముందు పెద్ద బాదంచెట్టు నీడలో, నులక మంచంమీద కూచొని, యిస్సురస్సురనుకొంటూనే వీధివంక చూస్తున్న ముసలమ్మ అతగాణ్ణి అనుమానంతో గమనిస్తూనే వున్నది. ఎవరో ఆఫీసరేమో. అయితే వెనక బిళ్ళ బంట్రోతులేడే, నెత్తికి గొడుగులేదే!

ఇక వుండబట్టలేక ఆ యువకుణ్ణే నిలవేసింది.

"ఎవురికోసంబాబూ ఆవజాన ఎండలో తిరగతన్నావ్?"

మురళి టక్కున ఆగిపోయాడు. ఎంత చల్లని పిలుపు. అంత గ్రీష్మ తాపంలో, చల్లగా దాహం తీరినట్లుగా తను ఎన్నేళ్ళ క్రితమో, ఆంధ్రదేశపు సరిహద్దుల్ని విడిచి పోకముందు నిత్యమూ విన్న మాటలు. నరసారావుపేట గ్రామీణ యాస.

"నాకో ఎడ్రెస్ కావాల్సి తిరుగుతున్నానవ్వా, వెంకటస్వామి అని - బస్సు డ్రైవరు. నా చిన్నతనంలో పొన్నూరులో పని చేస్తుండేవాడు"

"అడ్డేసా...అంటే సిరునామా అంటారా?"

అసాధ్యురాలుగా కనిపిస్తున్నది. తర్జుమాచేసి మరీ చెబుతున్నది.

"అవునవ్వా. ఆలపాటి సుబ్బారాయుడుగారి బస్సుల్లో వుండేవాడు. తరవాత ఆర్టీసీలో చేరాడని తెలిసింది. ఎర్రగా కుదిమట్టసంగా వుంటాడు"

"రా నాయనా - యిట్టా కూసో" వృద్ధురాలు తను జరిగి, చేతికర్రను జరిపి మంచంమీద చోటు చూపించింది. మురళి తన చేతిలోని రెండు పాకెట్లనూ పక్కనే వుంచి కూలబడ్డాడు.

"సోడా అన్నా తాగినావా బాబూ? వురేయ్ కోటేసూ - పెద్ద గళాసులో కుండనీళ్ళు తీసకరారా. గళాసు సుబ్బరంగా కడుగు నాయనా"- అని ఒకరిని ప్రశ్నిస్తూనే ఇంకోరికి పురమాయించింది. ఈ కోటేసు కోటేశ్వరరావు అయి వుండాలి. కోటప్ప కొండదేవుడు ఈ సీమలో యింటింటా ఏదో నామంతో ప్రతిధ్వనిస్తూనే వుంటాడుగదా అనుకొన్నాడు తను.

"మసగ సూపు అయింది నాయనా. ఆ బెల్లంకొండ డాకటేరు యవ్వారం ఏందో. శుక్కలాలు ముదిరినై. ఆపరేసనా సెయ్యాలంటాడు. చలికాలంలో నువ్వు తట్టుకోలేవంటాడు. ఇప్పుడేమో ఎండలు ముదిరినై. ఒక్క సినుకుపడనీ అని తేలేస్తున్నాడు"

ముసలమ్మ చిరునామా సంగతి మాట్లాడదు. తన గొడవేమో చెప్పుకొంటూ పోతోంది. "ఇవ్వాళ చస్తే రేపటికి రెండు. ప్యాణి మంచానబడకుండా పోతే అంతే చాలు. ఒకళ్ళచేత చేయించుకోవటమంత వుతుకుష్టం ఇంకోటి లేదు" అయితే ఆ పలుకులన్నీ ఏదో ఒక మౌలిక భారతీయ తత్వాన్ని, ఆలోచనల్ని రేకెత్తించేవిగా తనకు తోస్తున్నవి.

'కోట - అప్ప' అని ఈ పల్లీయులు ఆప్యాయంగా పిలుచుకునే ఆ స్వామిలాగానే, ఈ బెల్లంకొండ డాక్టరెవరో చాలా ప్రఖ్యాత వ్యక్తిగా తోస్తున్నాడు. ఉదయం తను గుంటూరులో టాక్సీ నెక్కినపుడు, ఆ డ్రైవరు గూడా ఏదో ప్రస్తావనలో డాక్టర్ను గురించి చెప్పాడు.

ఆ మారుమూల చిన్న బస్తీలో పేద సాదలకు దృష్టిదానం చేస్తున్న వైద్యుడికి ఏ సదుపాయాలున్నవో తెలియదు. తనకైతే ఎయిర్ కండిషన్డ్ కన్సల్టింగ్ గది. సర్జరీలో అమెరికా నుండి, రష్యానుండి తను స్వయంగా

ఎంపికచేసి, దిగుమతి చేసుకొన్న ఆధునిక - అత్యంతాధునిక పరికరాలన్నీ వున్నాయ్.

లండన్ ట్రాపికల్ డిసీజెస్ మెడికల్ స్కూల్లో తన చదువు ముగించి, వియన్నాలో కంటి వైద్యపు స్పెషలిస్టు ట్రైనింగు కోర్సు పూర్తిచేసి. మూడు "బిరుదుల్తో" స్వదేశంలో బోర్డు తగిలించినందుకు - కన్సల్టింగు ఫీజు అయిదు వందలూ, శుక్లాలు అనబడే కాటరాక్ట్ ఆపరేషనుకు నాలుగువేలూ వసూలు చేస్తున్నా - బొంబాయి కఫే పెరేడులో తన సర్జరీకి తరుగులేకుండా వచ్చే సింధీసేట్లు, రాజస్థానీ సెటానీలు, మల్టీనేషనల్ కంపెనీల డైరెక్టర్లూ, చేతిలో బ్రీఫ్‌కేసుల ఎగ్జిక్యూటివ్సూ - ఎవ్వరూ చిరునవ్వు తప్పితే, నోరు మెదల్చి నట్లు ఒక్క స్మృతీలేదు.

ఆ ఫీజు వాళ్ళ చెక్కు పుస్తకాలకు ఒక లెక్కలోదికాదేమో.సంవత్సరం. సంవత్సరం పెరుగుతున్న తన ఇన్‌కమ్‌టాక్సు గురించీ తనెప్పుడూ ఆలోచించలేదు.

ఈ బెల్లంకొండ డాక్టరు, మహా అయితే ఏ ఏభై రూపాయలకో మొత్తం ఆపరేషను ముగించి, జోడు ఇచ్చిందాకా ఛార్జి చేస్తుండాలి - అని తలపోస్తు న్నాడు డాక్టరు మురళి.

దుమ్ము, ధూళి, ఎండ, చెమట. ప్రొద్దున అపరిశుభ్రమైన హోటల్లో తిన్న పెసరట్టు కడుపులో దేవుతున్నది. ఆ చికాకులోనే, తిరుగుప్రయాణంలో ఆ డాక్టరుగార్నొకసారి దర్శిస్తే మంచిదనీ నిశ్చయించుకొన్నాడు.

ఈ వృద్ధ వనిత - కావిరంగు పాతచీరె, ముఖాన సగం జారిపోయిన తిరునామం - బహుశః రామానుజ పరంపరో, నడిగడ్డపాలెం వాసుదాస స్వామి వారి ఉపదేశలబ్ధో లేక అంగలకుదురు సుబ్బదాసుగారి దాసకుటి నివాసమో - పేరు రామానుజమ్మ కావచ్చు, తనకా వ్యక్తి తెలీదని చెప్పదు.

పైపెచ్చు దూదేకుల చినబుడేసాయిబు కొట్లో ఐస్ సోడా తెమ్మని కోటేసును మళ్ళీ తొందరపెడుతున్నది. విసుగుతో డాక్టరు మురళి తన పాకెట్లు రెండూ సంతరించుకొని లేచి నిలబడ్డాడు.

"వద్దవ్వా నేను సోడా పోతూ పోతూ తాగుతాను, మరి వస్తాను. కుండ నీళ్ళకు చాలా చాలా థాంక్స్. గన్నేరుచెట్టు ఇంట్లో వుంటాడని పల్నాటి బస్టాండ్‌లో తెలిసింది. వెళ్ళి వెతుక్కుంటాను"

పల్నాడు బస్టాండేమిటి, మూడు రోజుల్క్రింత తను ఇరవై పైనే ఏళ్ళ తర్వాత ఆంధ్రదేశంలో రైలు దిగి, తను చిన్నతనంలో చదివిన నిడుబ్రోలు

హైస్కూలు నుండి బయలుదేరి, భావనారాయణస్వామిగుడి, ఇదివరలో చూడని భారీ హనుమాన్ల మందిర సముదాయం చుట్టుపక్కల వాకబులు పూర్తిచేసుకొని, అటు నుంచి ఏవో గాలి చిరునామాలు ధరించి గుంటూరు, సత్తెనపల్లి, విజయవాడ ఎక్కడెక్కడ అన్వేషించలేదు? ఈ వేసవిరోజుల్లో బస్సుకాదు గదా టాక్సీల్లో పయనాల సంగతి ఊహించుకోవాల్సిందేగా.

తను పుట్టి పెరిగిన ప్రాంతమే మళ్ళీ, మార్పా? ప్లానింగ్ కమీషన్ వారు తెచ్చిన పదజాలం "దారిద్ర్యరేఖకు దిగువ వున్న వాళ్ళు"—తక్కువగానే కనిపిస్తున్నారు. నైదిబ్బలు అనబడే పెంటపోగులు, ఇళ్ళముందు ఎక్కడికీ పయనించలేని మురికి నీటిగుంటలు అట్లాగే వున్నా కొత్తగా దర్శనమిస్తున్న పశువైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఎరువుల గిడ్డంగులు, వ్యాపారులుగాని, పొగాకు ఎగుమతిదారులోమరి కట్టించిన నకిలీ అర్కిటెక్చరు భవంతులు, మధ్య మధ్య వరకట్నాల పెద్ద మొత్తాల పుణ్యమా అని వెలిసిన డాక్టర్ అల్లుళ్ళ నర్సింగ్ హోములూ, నర్సింగ్‌హోముకొక్కొక్క మందుల షాపూ. ట్రాన్సిష్టర్ రేడియోలకు లెక్కలేదు. నైలాన్ దుస్తులు. చాలామంది రైతులు గూడా పోలిష్టర్ ధోవతుల్తో కనబడ్డారు.

చిన్నతనంలో అమ్మమ్మ అంటుండే ఈ పేద 'పడమటిసీమ' ప్రజల దర్రిద్రం వీడిపోయింది. తనదేశం ప్రగతిపథంలో వున్నది. ఆ దృశ్యాల జ్ఞాపకం మళ్ళీ ఆ సంతోషాన్ని స్వల్పకాలమే నిలిపింది. దారిలో నెహ్రూవైన్ షాపులు, గాంధీమోడరన్‌వైన్సు, గుంటూరు టాక్సీడ్రైవరు చూపిన వారుణవాహిని సర్కారు సారాకొట్లు, వాటి సరసనే జాలీక్లబ్బులనబడే చీట్లపేక జూదశాలలు. సిమెంటు దిమ్మెలమీద గాంధీజీ, పండిట్ నెహ్రూ పోలికలున్న విగ్రహాలు-వీటిని తిలకించి ఏమని తలపోస్తున్నారో అనుకొన్నాడు.

అయినా తనిక్కడికి రావటం- ఈకాల పరిణామాల దస్తావేజుమీద ఆంధ్రదేశంలో సంతకం చేయటానికైతే గాదు. తన సంతకానికి అంత గొప్పతనం వున్నదని భ్రమపడటంలేదు. తనతో వియన్నాలో చదివిన ఫ్రెంచి విద్యార్థి జీన్‌పాల్ క్రిష్టో ఎప్పుడూ ఆవేశంతో అంటుండే వాడు- "ఫ్రాన్స్ మష్ట్ ఫేస్ ఇట్స్ ఓన్ హిస్టరీ"- అని.

అట్లాగే తన ఆంధ్రదేశం గూడా తన చరిత్రను, తన సంస్కృతీ జ్ఞాపకాలను- టెంట్ సినిమా హాళ్ళముందు, గంధర్వకన్యల నామధేయాల్తో వెలిసిన కల్తీ ప్రపంచేజీగల సినిమా థియేటర్లముందు- నిలబెట్టిన "ఆమె

కామరాత్రులు" పోస్టర్లతోనూ, అర్ధనగ్నంగావున్న హీరోయిన్ గండ్రగొడ్డలితో విలన్‌గాడి శిరఃఖండనం చేసి, రక్తంతో తిలకం ధరిస్తున్న దృశ్యాలతోనూ-తృప్తిపరుచుకొంటూంటే మధ్య తనెవరు? కాకపోతే బొంబాయిలో అరాజక జనారణ్యంమధ్య ఇట్టి పోస్టర్లు నగర సంస్కృతిలో భాగాలుగా కనిపిస్తవి.

ఇక్కడి ప్రశాంత వాతావరణంలో తన చిన్ననాటి సుందర వాస్తవాన్ని ధ్వంసంచేస్తున్నట్లుగా గోచరిస్తున్నవి. టాక్సీ డ్రైవరు ఈ సినిమాలకు పెట్టుబళ్ళు పెడ్తున్న సారాకంట్రాక్టర్లు, రాజకీయ వ్యాపారం చేస్తున్న పెద్ద భూస్వామ్య పుత్రులు, చిట్‌ఫండ్ కంపెనీల అధినేతలు, నల్లధనం అపారంగా గల రకరకాల వ్యాపారుల్ని గురించి పెద్ద ఉపన్యాసమే దంచాడు.

'వెనక తాగుడుతప్పు. ఇప్పుడు నిత్యఫాషను. తనుగూడా, తన వంశంలో ఎప్పుడూ లేనిది, తాగుతానని' గూడా ఒక సాధారణ సత్యాన్ని అతి సౌమ్యంగా చెప్పాడు.

ఇంకా తాత్సారిస్తే సాయంత్రానికి తను విజయవాడ చేరేది కల్ల- అనుకొంటూ డాక్టరు మురళి వేసిన మొదటి అడుగుకే ముసలమ్మ కళ్ళెం వేసింది.

"అయితే ఆయన మీకు బంధుగులా?"

ఈ వృద్ధులికి అక్కరలేని విషయాల్లేవు.

"బంధువులు కాదు గాని...కావల్సిన వాళ్ళు...అంటే...ఆయన భార్య కమలమ్మకు నేను కొంచెం బాకీ వున్నాను...అక్క అని పిలిచేవాణ్ణి... చిన్నతనంలో"

నిజానికి ఒక్కసారే- అదే మొదటిసారి బహుశ యిప్పటికీ చివరిసారి-ఆమెను అక్కా అని పిలిచింది, సిగ్గుపడుతూ, తలవంచుకొని. ఎన్నేళ్ళు? దశాబ్దాలు? ఆమె తనకు ఐదు రూపాయల నోటు అందించినపుడు.

"నరజలమ ఎత్తినాక ఒక మడిసి యింకో మడిసికి బాకీ వుండడెట్టా? వుంటాడు. బాకీలు తీర్చకపోతే యింకో జలమ ఎత్తాలంటారుగా గేనులు"

ఈ ఎండిపోయిన కొమ్మలాంటి ముసలమ్మ- రామానుజులవారు దేవాలయం రాజగోపురం ఎక్కి అప్పటిదాకా అగ్రకులాలవారికే తెలిసిన నారాయణ మంత్రాన్ని సర్వమానవులకు ఎలుగెత్తి ఉపదేశించినట్లుగా, జననమరణాల రహస్యాన్ని వివరిస్తున్నది. మాట్లాడితే మెట్ట వేదాంతం మెట్లు- అని అంటుండేవారు డాక్టరు వీరభద్రరావుగారు.

వహాలా లేబొరేటరీస్ డైరెక్టరయి అంతర్జాతీయ ఖ్యాతిపొందినా, ఆయన తను పుట్టిన కుగ్రామం గురించి నిద్రలో గూడా మరిచిపోయేవారుగాదు.

తను పూర్తిగా ప్రవాసి అయిపోయినా, ఆంధ్రదేశానికీ తనకూ అనుబంధంగా నిలిచిన గురుసమానులు.

మురళి ఆ ఎండుకొమ్మ ఆలాపిస్తున్న ఆధ్యాత్మిక సంగీతానికి ముగ్ధుడై నిలిచి పోలేదు. మురుగు కాలవమీది నల్లరాతి బండను దాటటానికి కాలువేశాడు. వడగాలి.

''ఎట్టెట్టా? అనుమంటి వడతీత తీస్తన్నది. ఇంత వణ్ణం బోంచేయ కుండా యాడికంట ఎల్లేది? తెలవక అడుగుతున్నదనుకో యీ ముసిలిముండ రామానుజమ్మ! మీ డాక టేరు వైద్దుగులికి ఆకలిదప్పులుండవేంది బాబూ? ఎంత లేనోళ్ళమయినా, గడపలో చెప్పులిడిసిన ప్యాణికి యింత యిస్తరాకులో పెట్టలే నోళ్ళం కాదు నాయనా!"

డాక్టరు మురళి కొయ్యబారి పోయాడు. తను ఊహించినట్లుగా ఆమె నడుం వంగి లేదు. గడకర్రవలె వుంది. ఎండిన వృక్షశాఖ అనుకొంటే సజీవ హరిత సంగీతం విన్పిస్తున్న వేణువులాగా చేతికర్రతో తన నాపేసింది. పైగా నువ్వు డాక్టరువు కావా అంటున్నది. దివ్యజ్ఞానమా? గాలిలోకి విసిరేసిన గుడ్డి బాణమా? అప్పుడు-ఆమె వేపు నుంచి దృష్టి మరల్చినప్పుడు-ఎదురుగా తను వెతుకుతున్న గన్నేరు చెట్టు. పొరుగింటికీ యీ యింటికీ మధ్య చూరునీళ్లు పడే జాగాలో. ఎండ తీక్షణతలో తన కళ్ళే యిప్పటిదాకా చూడ జాలని చెట్టు.

''నేను డాక్టర్నా? నీకెట్లా తెలుసవ్వా?'' అని మాత్రం ప్రశ్నించగలి గాడు, ఆ సంభ్రమంలోనే. ముసలమ్మ క్షీణహాసాన్ని గమనిస్తూనే.

"ఎట్టానా? తెలిసినోళ్ళు చెబితే" అంటూనే తన చేయి పుచ్చుకొని యింట్లోకి దారితీస్తున్నది. ''మా కమలమ్మ చెప్పలేదా? కోటేసూ-గాబులో నీళ్ళుతోడరా. లచ్చిమీ, దొడ్డో అరిటాకు కోసకరామ్మా-నడివింట్లో నా మనవడి బల్లమీద వడ్డించు'' పురమాయింపుల మధ్యనే తన చేతిలోని పాకెట్లను లంకించు కొన్నది.

"అది గాదవ్వా.... కమలమ్మక్కేది? నేనొచ్చింది ఆమెను చూచేందుకే. వెంకటస్వామిని పలకరించేందుకే"

"యెంకటసామి-యెంకటసామి అనుకొంటా ఊరంతా తిరిగావు గామాలు. నా మనవరాలి మొగుడి పేరు- యెంకటేసుర్లు"

ఎంత పొరబాటు? ఎండ తాకిడికి తబ్బిబ్బై, తను యిట్లా రెండు పేర్లు అడుగుతూ రామిరెడ్డి వీధినుండి ఏంజెల్ టాకీసు సందుగొందులు, కొత్తగా

నిర్మాణ మవుతున్న శంకరమఠం దాకా తిరిగాడు. ఈ కాలజ్ఞాని అది గూడా పట్టేసింది.

అయినా కమలమ్మ సంగతి చెప్పదు. మురళి వరల బావిలో నీళ్ళు అంత చల్లగా వుంటాయని అనుకోకుండానే పెద్ద గాబును ఖాళీచేశాడు. కోటేసు యిచ్చిన నీరుకావి ధోవతిని లుంగీగా మడుచుకొంటూన్నా, తనను గురించి కమలమ్మకు ఎవరు చెప్పివుంటారా అని ఆలోచనల తీగను లాగుతున్నాడు. బహుశః తనతో నిడుబ్రోలు హైస్కూల్లో చదివిన భాష్యకరాచార్లు చెప్పివుంటాడు.

అతనొకసారి పదిపన్నెండేళ్ళక్రితం మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం ఇంటర్వ్యూకు వచ్చి, హఠాత్తుగా కొలాబాలోనే కలిశాడు. తన సర్జరీకి వచ్చి రికమెండేషనూ తీసుకెళ్ళాడు. అరిటాకు కోస్తున్న 'లచ్మీ' అని పిలువబడ్డ ఆమెనూ చూశాడు. కమలమ్మేనని భ్రమ కలగ జేసింది. ఆమె చెల్లెలై వుండాలి. తను కల్పనాత్మకంగా యిచ్చిన రామానుజమ్మ పేరు అవాస్తవం కాదు అని మురిసిపోయాడు.

టాటాలో పెద్ద శాస్త్రజ్ఞుడుగా పనిచేసే శాస్త్రి-కవిత్వంలో కల్పనాత్మక వాస్తవం, భావలయ, శబ్దలయ, అంతర్లయ అని వేదుల పద్యాల్ని, క్రిష్ణశాస్త్రి గేయాల్ని, అబ్బూరి కవిత్వాన్నీ- తన తలకెక్కించాలని చేసే ప్రయత్నాలన్నీ స్మృతికి తెచ్చుకొంటున్నాడు. అయితే యీ రామానుజమ్మకు కొడుకులు లేరన్న మాట. కూతురి బిడ్డలయి వుండాలి-యీ లక్ష్మి, కమలమ్మలు.

రామానుజమ్మ విసనకర్రపుచ్చుకొని అతని ముందు కూర్చొన్నది. మురళి విస్తరిలో చేయిపెట్టకుండానే- "వాళ్ళ సంగతి చెబితేనే అన్నం తినేది" అని సత్యాగ్రహంలో మొదటి మాటను ఉచ్చరిస్తూ నిలుచుండిపోయాడు.

"తిను- చెబుతా"

"ఊహూఁ..."

"వాళ్ళు లేరయ్యా"

"అంటే...?"

"కాలం వెళ్లిపోయిండి...పోయారు" అన్నది మెల్లిగా.

## 2

కోటేసు వేసిన నర్సారావుపేట పడక కుర్చీలోనే మురళి మాగన్నుగా నిద్ర పోయాడు. పోయాడో లేదో- అది చేతనకు అందని విషయం. రెండు

ప్రపంచాల మధ్య తన ఉనికి అనుకోలేదుగాని-యీ అజ్ఞానినని చెప్పుకొంటున్న వృద్ధురాలు అన్న మాటలు తను చేతనావస్థలోనే వున్నట్లు చెబుతున్నవి.

కొందరు జీవులు అప్పులు చేయటానికే జన్మిస్తారు. అప్పులు తీర్చటానికే బ్రతుకుతారు. కాని తన అప్పు యిక తీరదు.

గతమంతా కన్నులముందు. తన తండ్రి అకాలపు చావు. ఇల్లు వేలం పాటలో చరమసంధ్యగా తనకు కన్పించటం. గాలివానలో చెట్టుకొమ్మలు. బంధువుల యీసడింపులు. తల్లి తనతో అన్న మాటలు. పొన్నూరులో తన చదువు వారాల యిళ్లల్లో పాచి అన్నం. సరసన కూచొన్న స్వంత బిడ్డకు నెయ్యి. తనకొక విదిలింపు.

కన్యకాపరమేశ్వరి సత్రం అరుగుల మీద పుస్తక పఠనం. మండాది రంగమ్మగారి పూటకూళ్ళింటి వరండాలో చేతిని దిండుగా ముడిచి నిద్రించిన రాత్రులు. చలికాలంలో, పురోహితుడు సుబ్బరామయ్యగారు తద్దినాల ధోవతిని తనకు కప్పటం. పాత పొన్నూరులో చిన్న కరణం గారింటికి ఆకలితో వెళ్ళినప్పుడు "ఇంకో తద్దినాన్ని తెచ్చావా?" అని ఆ తల్లి మాటల్తో వెనుదిరగటం.

హెడ్ కానిస్టేబుల్ కొడుకు, తన సహాధ్యాయి- విష్ణుపాదాల సాంబు. పావలాతో సీతమ్మ కొట్లో అట్లు ఆ కిందటి రోజు ఉపవాసాగ్నికి అల్పాహారం. తన మీద జాలితోనో, ప్రేమతోనో సాంబు యింటికి పిలిచినా- నల్లమందు తిని నిద్రపోయి వంటచేయని తల్లితో విసిగి తమ బంధువు కమలమ్మ యింటికి దారి తీయటం.

గోడలు చవుడు పట్టినట్లున్నా కళ కళలాడుతున్న ఇల్లు. ఏదో పుస్తకం చదువు కొంటున్నది. రవివర్మ సరస్వతీదేవి పటం. తన కడుపులో మూడవ పూట ఆకలి. ఆమె చిరునవ్వుతో సగం తీరిన ఆకలి. కన్నతల్లి జబ్బుతో వున్న బిడ్డకి అందించే అభయముద్ర. వాకిలికి పూసల తెర రంగులు.

"బ్రాంబలబ్బాయి గదూ?"

తన తల వూగలేదు. ఊగింది సాంబు శిరస్సు.

గదిలో నల్ల బండల్ని కడిగింది. ముగ్గు పెట్టింది. దానిమీద కడిగిన కుంపట్లో బొగ్గుల అగ్ని తళతళలాడుతున్న యిత్తడి గిన్నెలో బియ్యం. "రా బాబూ-" అన్నది.

బావి దగ్గర బొక్కెనతో నీళ్ళు తోడియిస్తూ "ఏ పాపం చేశానో పిల్లలు తిరిగే యిల్లు కాదు నాయనా, మడితో వండుకో" అంటున్నది. కందిసున్ని,

నెయ్యి, పెరుగు. తిని అక్కడే నిద్రపోయాడు. లేచింతర్వాత అరటిపండు పెట్టింది. పోతూంటే "ఇబ్బందయితే మొగమాటపడకు. మా యింటికి రా" అన్నది.

తను కన్నీళ్ళు ఆపుకొని మాటరాక వెళ్ళిపోయాడు. ఎక్కడైనా కన బడితే వెంకటేశ్వర్లు గుబురు మీసాల సందు నుంచి చిరునవ్వుతో పలకరించే వాడు. పావలా బిళ్ళ యిస్తాడని తను తప్పించుకు పోయేవాడు.

చివరికి ఆ పావలా బిళ్ళతోనే, అటెండర్ సాయిబుకిచ్చి తను చివరి రోజున యస్.యస్.యల్.సి. పుస్తకం తెచ్చుకొన్నది. తను పాసయినానని మంచి మార్కులొచ్చాయని చెప్పటానికి కమలమ్మ యింటికి వెళ్ళాడు.

జ్ఞాపకాలు. జ్ఞాపకాలు. చరిత్ర. విధి విలాసం. నెపోలియన్ మాటలు-డెస్టినీ. డెస్టినీ!

తన తల నిమిరి- అయిదు రూపాయిల నోటు చేతిలో పెట్టింది. "ఎందు కక్కా?"

"పనికివస్తుంది"-నవ్వు.

మద్రాసుకు నిడుబ్రోలు నుండి ఆ రోజుల్లో నాలుగు రూపాయల పావలా టిక్కెట్టు. పాసింజర్ నత్తనడక బండి. ఫస్ట్‌లైన్ బీచ్. బ్రిటిష్ షిప్పింగ్ కంపెనీ. చేతిలో తన మార్కుల పుస్తకం ఒక్కటే గాదు. కమ లమ్మ చిరునవ్వు ఆశీర్వాదం.

తక్కిన విషయమంతా చరిత్రే. స్టీమర్‌లో పాయిఖానాలు, స్టీలు నేలలు కడ్డీలు కడుగుతూ స్కాట్లెండులో అడుగు పెట్టటం. షిప్పింగ్ కంపెనీ హెడ్డాఫీసుసులో మద్రాసు మేనేజరు ఉత్తరం యిచ్చినప్పుడూ డెస్టినీ.... డెస్టినీ.... పనిచేసింది.

ఎడిన్‌బరోలో తన సైన్సు చదువు. సిడ్డాల్, ఎలియట్, హ్యారిస్ తన టీచర్లు. లండన్‌స్కూల్లో స్కాలర్‌షిప్. నాలుగేళ్ళు. రెండేళ్ళ ఇంటరన్‌షిప్. ఫ్రాన్సులో సెలవులు గడపటానికి సేవింగ్స్. కాని తను వెళ్ళింది- వియ న్నాకు.

ఇది మామూలు దారిగాదు. అప్పుల దారి. ఇన్నేళ్ళ తర్వాత యీ అప్పులన్నీ తీర్చాలని తనకెందుకు సంకల్పం కలిగింది? తన తల్లి అప్పు తీర్చగలడా? తక్కినవి జ్ఞాపకం చేసుకొంటూ ఒక్కటొక్కటే తీరుస్తున్నాడు. ఇదొక శృంఖలిక.

ఈ చైన్‌కు మొదటి లింకు— కమలమ్మ. ఎవరి ప్రేరణ? జడతనుండి మేల్కొలుపు - గతం. గతం నుండి జ్ఞానం, దారినిండా అప్పులు. అప్పులు. వాటి నుండి పారిపోయి తనెట్లా మనిషవుతాడు. డాక్టరు శాస్త్రి వినిపించే పాటలు. తను మరిచిపోయిన తెలుగు భాషను, మాతృశబ్ద తరంగాల్ని మళ్ళీ గుర్తుకు తెచ్చిన పాటలు.

కాని యీ విధి స్వరూపం ఏమిటి? తనకు బిడ్డలు లేరని కుమిలి కుమిలి, కమలమ్మ 'గ్లకోమా' కంటి జబ్బుతో చనిపోయిందా? తను కంటి డాక్టరా? ఆమెది ఆ జబ్బే ఎందుకు కావాలి? ఈ రామానుజమ్మ యివన్నీ చెప్పి తన మనఃశాంతిని ఎందుకు కాల్చివేసింది? వెంకటేశ్వర్లూ పోయాడు. శాస్త్రి పాటలో వలె.

"లోపలి చీకటిలో, గదిగదిలో మూల్గులు వినవచ్చే ఎద ఎదలో"- ఎవరో తిలక్ పాటట. కమలమ్మ లేని లోకంతో అతనికీ పని తీరిపోయింది.

## 3

కరెంటు ఆఫీసుతో పనిచేసే కమలమ్మ మరిది- లక్ష్మి భర్త కోటేసు తండ్రి- వచ్చి తనను నిద్ర లేపాడు.

"చీకటిపడ్తున్నది" బయట టాక్సీ డ్రైవరు— పొద్దుట్నించీ పోలీస్ స్టేషను ముందు తను నిలబెట్టినవాడు వచ్చాడు గాబోలు.

మురళికి రామానుజమ్మ ఎండలో ఆరబెట్టిన తన షర్టు తెచ్చి యిచ్చింది. "జేబునిండా అన్ని నోట్లు. అవజాన పారేశావు" అంటున్నది.

కోటేసు చల్లటి మజ్జిగ గ్లాసు, సోడా సీసా అందిస్తున్నాడు. తను అవేమీ పట్టించుకోవటంలేదు. రామానుజమ్మ వంకనే చూస్తున్నాడు. అవును, రాలిపోతుంది. చెట్టున పండి మగ్గిపోయిన పండులాగా. మళ్ళీ కనబడదుగదా. ఇంకో అప్పు.

మురళి కళ్ళనిండా అశ్రుజలంతో, కంఠం నిండా వెలక్కాయలతో నుంచున్నాడు. బయట టాక్సీడ్రైవరు. రాత్రికి బెజవాడలో తను ఎక్కవలసిన రైలుబండి. ఆ యిల్లంతా ఒక్కసారి కలియజూశాడు.

అందులో వస్తువులు అన్నీ కలిపినా, తను న్యూయార్క్‌కు విమానంలో రానూపోనూ పెట్టిన ఖర్చంత వుండదు. కాని యీ రామానుజమ్మ, ఆమె మనవడి భార్య కమలమ్మ, వెంకటేసులూ, యీ కోటేసూ, లక్ష్మి వీళ్ళకు విలువకట్టగలడా?

"అవ్వా..."

ఎట్లా గ్రహించిందో- రాకడ పోకడ నీచేతుల్లో లేదయ్యా" అంటున్నది.

"అదికాదవ్వా- ఇందులో కమలమ్మక్కకు తెచ్చిన చీరె వుంది"-అది తను హైదరాబాదు విమానాశ్రయంలో కొన్నది. చీరె కొనటం మొదటిసారి. రెండో పాకెట్‌లో కరాచివాలా బొంబాయిస్వీట్లు. తన జేబులో ఆనాటి అయిదు రూపాయలనోటు విలువ అయిదువేలు. అన్నీ ఆమెకు అందించాడు.

"నువ్వు కంటి ఆపరేషన్ నాచేత చేయించుకోవా- అని అడగాలనుకొన్నాను. ఇప్పుడు అడగను. బెల్లంకొండ డాక్టరుది మంచి హస్తవాసి" అన్నాడు.

"అప్పు తీరస్తున్నావా? బాబూ?" అంటున్నది.

డాక్టరు మురళి మాట్లాడలేదు. టాక్సీ ఎక్కాడు. ○

స్వాతి - ఏప్రిల్ 1991

# మహాబోధి ఛాయలో

"చెట్టువు చెట్టు లాగానే నిలబడతానంటావా? లాభంలేదమ్మా, దుష్టులు నిన్ను నరికివేస్తారు. నిన్ను నరికిన గొడ్డలి కర్రగా మారిపోతల్లీ. దుష్టులు నీ జోలికి రారు"

—ఒక సింధీ కవి

* * *

"నారాయణ...నారాయణ" అని బంధువులు మూకుమ్మడిగా వుచ్చరించారు.

"నారాయణ...నారాయణ"అని అందుకొన్నారు మా జ్ఞాతులూ, దాయాదులూ.

కొన్ని క్షణాలనుంచీ నిశ్శబ్దంగా వున్న వాతావరణం ఒక్కసారిగా శోకావృతమై పోయింది. పాడె నాలుగు కొమ్ములూ పట్టి మామయ్య, చిన్నాన్న యింకెవరో - భుజాలమీది కెత్తుకున్నారు.

ఆ నామ సంకీర్తన సంకేతం అదే కాబోలు. నాకెట్లా తెలుస్తుంది- నా వయసెంతో గూడా వూహించలేని వాణ్ణి!

అది నాన్నగారి అంతిమయాత్ర-అనిమాత్రం గ్రహించాను, పెదనాన్న ముందు నడుస్తూ వెనుతిరిగి చూడకుండా దారి తీస్తున్నట్లుంది. చేతిలో అగ్ని కుంభపు వుగ్గం.

అప్పటిదాకా నన్ను బలవంతంగా పట్టి ఆపుతున్న వరాలక్కయ్యనూ, హనుమాయమ్మ అత్తనూ - విదిలించి కొట్టి - వాళ్ళ పట్టునుండి తప్పించుకొని, నేనూ శవయాత్రలో జొరబడిపోయాను.

వెనకనుంచి అరుపులు, ఏడుపులు, మాటలూ వినబడుతూనే వున్నయ్.

"పాపం పసివెధవ"

"నిన్న పొద్దుట గూడా తండ్రి ఒడిలో ఆడుకున్నవాడు గదు తల్లీ!"

"ఏమిటో కర్మ. వాడికి వడుగు చేసివున్నా బాగుణ్ణు!"

అన్ని గొంతుల మధ్యా అత్తయ్య ఆందోళన.

"చూస్తూ నుంచుంటావేం శేషయ్యా,

బాబును పట్టుకో...అయ్యో - జడుసుకొంటాడర్రా"

అక్కయ్య తత్తరపాటు!

"ఆ శేషయ్యవల్లేమవుతుందమ్మా. వఠి అయోమయం మనిషి"

దారిమధ్యలో శేషయ్య నన్ను గట్టిగా పట్టి ఆపివేశాడు. శేషయ్య మా పొలం కౌలుదారు. రోజూ నాకు మట్టి బొంగరాలు చేసి యిస్తూండేవాడు.

"శ్మశానానికి మనం పోగూడదు చిన్నయ్యా"

"ఏం?"

"దయ్యాలుంటై - భూతాలు సంచారం చేస్తుంటై"...

శేషయ్య ఆ మాటలన్నాడో లేదో, ఎవరో "అబద్ధం, అబద్ధం" అని మృదువుగా నా చెవిలో వూదినట్లయింది. చుట్టూ చూశాను. ఎవరూ కనిపించలేదు. ఆకసం కేసి చూశాను.

అప్పుడు కనిపించింది ఆ చెట్టు. చాలా పెద్దది. మా వూళ్ళో అంత మహా వృక్షం వుందా? అని ఆశ్చర్యపోతూన్నానేమో, చెట్టు గలగలమన్నది. పైనుంచి నన్ను ఓదారిస్తూ ఎండుటాకులు నా తలమీద వర్షిస్తున్నది.

ఆ చెట్టుతో అదే నా ప్రథమ పరిచయం.

* * *

గతం - మంచుంవంటిది అంటారు కవులు. స్మృతి గర్భంలోకి వెళ్ళి పోతుందంటారు. కాని నా విషయంలో కాదు. ఆనాటి దృశ్యం యిన్నేళ్ళ తర్వాత గూడా, తలచినప్పుడల్లా మాటల్లో బంధించలేని విపుల మనోచిత్రణ లాగా ఎదుట నిలుస్తుంది.

కొల్లి శేషయ్య నాకు మట్టి బొంగరాలు యిచ్చి దుఃఖాన్ని వుపశమించే మాయలన్నీ చేస్తున్నాడు. నేనైతే చెట్టువంకే దృష్టి నిలిపాను. ఒక పార్శ్వంలో

వూడలు గూడా దిగినాయి. చితారు కొమ్మలదాకా ఎన్నో పక్షుల గూళ్ళు. కలకలమంటూనే రెట్టలు వేస్తున్నవి.

అవి నేరుగా ఆనుకొనేవున్న చెరువులో పడ్తున్నవి. ఆ చెరువెంత విశాలమైనది? రెట్టలకోసం చెరువులో చిన్న చాపలు ఈదుకుంటూ వచ్చి ఎంత ఆప్యాయతగా వాటిని భక్షిస్తున్నవో. పైన పక్షులు, కింద చేపలు. చెరువు ఆవలికట్ట నానుకొనే తాటితోపు.

ఆ తోపు నుండే అస్తమిస్తూన్న ఎర్రటి సూర్యబింబం గూడా కనిపించింది. ఆకాశంమీద మేఘాలు చకచకా కదలిపోతున్నవి.

చెట్టు నానుకొని యీ సుందరలీలను పరికిస్తున్నవాణ్ణి ఎప్పుడు నిద్రపోయానో తెలియదు. కళ్ళు నులుముకొని చుట్టూ వీక్షించేసరికి శేషయ్య లేడు.

చెరువుగట్టు మీది బావి దగ్గర, నాన్నను ఖననం చేసివచ్చిన మా బంధువర్గమంతా అశుచి స్నానాలు చేస్తున్నారు.

రావుల సుబ్బమ్మగారి మఠంలో విడిసిన బైరాగులు చెట్టుకింద చితుకులతోనే మంటలుచేసి అన్నం వండుకుంటున్నారు. సూదులగుంట కోటయ్యగారి ధర్మ సత్రంనుండి గంట వినిపిస్తున్నది.

సత్రంలో వూరి ఆసాముల గురువు లెవరో దిగినట్లున్నారు. మావాళ్ళు నన్ను వెతుక్కుంటూ వచ్చారు-

"శేషయ్య... శేషయ్య ఏడీ...?"

"ఆ బైరాగి వాళ్ళతో గంజాయి దమ్ము కొడ్తుండాలి"

"పిల్లవాణ్ణి వదిలి ఒంటర్ని చేసి పోతాడా, పిచ్చిముండాకొడుకు!"

నేను చెట్టుతో సంభాషణ జరుపుతూ, ఆ మగతనిద్రలో గూడా దాన్ని పొడిగిస్తూ ఒంటరిగా లేననీ భయపడలేదని వాళ్ళకు విశదీకరించటం అప్పటికి నా చేత కాలేదనుకొంటాను.

* * *

కొన్నాళ్ళ తర్వాత నా చిన్నతనంలోనే కొల్లి శేషయ్య, నా బొంగరాల నేస్తం, నిజంగానే బైరాగుల్లో కలిసి వెళ్ళిపోయాడు. అతని భార్య రత్తమ్మ. ముసలి తల్లి నాగమ్మ - అమ్మ వద్దకు వచ్చి భోరున రోదించటం గూడా నాకు బాగా గుర్తు.

ఎన్నిసార్లు ఆదుఃఖాన్నీ, శోకాన్నీ విన్నానో! రత్తమ్మ నన్ను కావిలించుకొని తన హృదయంలోని గాయాన్ని వేయి పుటల వ్యాఖ్యానం లేకుండానే, ఎన్నిసార్లు చూపిందో - చెప్పలేను.

నేనైతే-మాదక్షిణ వీధినుండి సందుల్లో గొందుల్లో నడిచి ఎక్కడోవూరి వుత్తర సరిహద్దుల్లో వున్న ఆ చెట్టు కిందికే వచ్చి మౌనంగా కూర్చొనేవాణ్ణి.

"శేషయ్య వున్నాడు, తనను తను వెతుక్కుంటున్నాడు. తన నీడ నుండి విడిపోదామని కొండల్లో గుహల్లో తిరుగుతున్నాడు"

ఈ మాటలు ఆ వృక్షరాజం అన్నదంటే మీరు నమ్ముతారా? నమ్మరు.

బడి నుంచి వచ్చి ఆటలు ఆడుకొంటున్నవాణ్ణి- శేషయ్య నన్ను ఆచెట్టు చుట్టూ ఆటలతోనే ప్రదక్షిణలు చేయించటం, మఠంలో పెద్ద అరుగుమీద గోసాయివాళ్ళ మధ్య కూచోబెట్టి వాళ్ళ తత్వాలు వినిపింప జేయటం, సత్రం మెట్లమీద నిలబెట్టి స్మశానం నుండి పైకి లేస్తున్న పొగల్ని చూపటం, తాటి తోపుగుండా చెరువు దూరపు గట్టు మీది నాగుజెముడు పొదల్లో, కాలిబాటల్లో తిప్పటం- ఇంట్లో యీ విషయాలు ఎవరితోనూ ముచ్చటించేవాణ్ణిగాదు.

ఆ చెట్టుతో స్నేహం కలిపిన శేషయ్య, భూమి మీది సజీవ వస్తువు లన్నింటితోనూ స్నేహం కుదిర్చిన ఆ చెట్టూ- ఒకటిగాదా? అనిపించేది.

రత్తమ్మ ఆ చెట్టుకింద క్షణకాలం నిలబడితే తన గాయం మానిపోతుంది గదా. రత్తమ్మకు ఈ విషయం ఎట్లా చెబటం? ఒక గొప్ప పరమార్థాన్ని వ్యావహారికంగా అనువదించటం నాకు సాధ్యమా? చిన్నవాణ్ణి.

కాని ఇరవై సంవత్సరాలు కాలరథం పయనించిన తర్వాత, యిది సాధ్యమైంది. ఎక్కడో వుద్యోగంలో వున్నవాడికి, అమ్మ చేత- శేషయ్య భార్య రత్తమ్మ వుత్తరం రాయించింది.

ఎవరో సాధువు వుత్తరాది నుంచి వచ్చి చెట్టు కింద విడిదిచేశాడు. తనే శేషయ్యనని వెల్లడించుకొన్నాడు. వయసు తప్పితే అదే ఆకారం, అదే కుడిచెవి కింద పుట్టుమచ్చ, అవే లోతుకుపోయినకళ్ళు. తెలుగూ హిందీ కలిసిన మాటలు.

గ్రామస్తులు అతన్ని సన్యాసాశ్రమం విసర్జించి భార్యను ఏలుకోమని నచ్చచెబుతున్నారు. రత్తమ్మ అతడికి చాలా పరీక్షలు పెట్టింది. మరి ఆమె అత్త నాగమ్మ- కొడుకు దిగులుతోనే గతించిందాయెను. కొందరు గ్రామస్థుల్ని గుర్తు పడ్తున్నాడు. కొందర్ని గుర్తుపట్టటమూలేదు.

వాళ్ళింట్లో రత్తమ్మ ఏ మూల ముంతలోపోసి డబ్బులు దాచిపెట్టేదో గూడా చెప్పగలుగుతున్నాడు. రత్తమ్మను ఆవేదనతో చూస్తున్నాడు. కాని ఆమెకు నమ్మకం కుదరలేదు. నన్ను రమ్మని వుత్తరం వ్రాయించటం- చివరి పరీక్షకే.

నేను వూళ్ళో దిగిన మర్నాడే రత్తమ్మ సాధువు చెంతకు తీసుకొని పోయింది. అదే చెట్టుకిందే కూర్చొని పద్మాసనంలో వున్నాడు-సన్యాసి.

నేను చెట్టు నీడలోకి ప్రవేశించానో లేదో పైనుంచి ఎండుకొమ్మొకటి నా శిరస్సుమీద పడింది. చిన్న కొమ్మ. పైకి చూశాను. కావు, కావుమంటూ కాకులు ఎగిరిపోతున్నవి.

సాధువుకు అమ్మ యివ్వగా తెచ్చిన నారింజపండు సమర్పించి ఎదుటనే నుంచొన్నాను. కళ్ళల్లోకి సూటిగా చూచాను. నిస్పందన.

"శేషయ్యా...నేనెవర్ని?"

చిరునవ్వు. నేను రత్తమ్మ వంక, ఆమె నావంక చూపులు.

చెరువుగట్టు మీది తడి రేగడి మట్టి ముద్దతెచ్చి అతని చేతి కందించాను.

"శేషయ్యా, నాకు బొంగరం చేసిపెట్టవా?"

అర్థంకాలేదా? నావంక అయోమయంగా దృక్కులు సారించాడు.

హిందీలో చెప్పాను: "లట్టూ...లట్టూ! లట్టూ బనావ్ శేషయ్యా!" బొంగరాన్ని హిందీలో 'లట్టూ' అంటారు.

అచేతనంగానే వుండిపోయాడు. మట్టిముద్ద చేతిలో అట్లాగే వుంది.

"దొంగ...చోర్?"

ఆకులు గలగల రాలుతున్నవి. చోర్, చోర్...!

కమండలాన్ని వదిలి సాధువు పరుగు లంకించుకొన్నాడు. అప్పటిదాకా యీవింత చూస్తున్న వూరి యువకులు దుడ్డుకర్రలు ధరించి వాడిని తరమటం మాత్రమే నేను చూశాను.

రత్తమ్మ ఏడ్చి, గుండెలు బాదుకొని చెరువులోదూకి కనబడని శూన్యంలో కలిసిపోతుందేమోనని భయంతో అడ్డంగా నిలబడిపోయాను.

కాని ఆమె-నిశ్శబ్దంలో నిశ్శబ్దంగా చెట్టువేళ్ళమీద చాలా సేపు కూచొన్నది. కళ్ళ నీళ్ళుగూడా పెట్టుకోలేదు అప్పుడు నాకు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది– యీ దొంగ గోసాయి ఆకారం.

నా చిన్నతనంలోనే శేషయ్య గ్రామంలో వున్నప్పుడు, వీడు మఠంలో కొన్నాళ్ళు మకాంచేశాడు. శేషయ్యతో స్నేహం చేశాడు. ఇద్దరూ గంజాయి పట్లు పడ్తుండేవాళ్ళు. వాడు రత్తమ్మను వీక్షించినది ఆవేదనతోనని పొరబాటుగా అనుకొన్నాను. ఆవేదన కాదు–తీరని తమితో తిలకించాడు.

చెట్టూ చుట్టూ అప్రయత్న ప్రదిక్షణ చేస్తున్నప్పుడు, యీ సడిచిపోయిన స్మృతిమేఘం యిన్నేళ్ళ తర్వాత తిరిగివచ్చింది. శేషయ్య యింకా తనను తాను వెతుక్కునే అన్వేషణలో వున్నాడా? లేక యీ దొంగ గోసంగి అతన్ని అయిపు లేకుండా చేశాడా?

రత్తమ్మకు తగిలిన యీ గాయాన్ని ఎవరు మాపుతారు—అనుకొంటూండ గానే రత్తమ్మ మాటలు వినవచ్చినవి.

"చిన్నయ్యా, నేను చస్తే తలకొరివి పెడతావా?"

నాది ఆమె కులంగాదు. గోత్రంగాదు. ఆశ్చర్యపడి ఆమె వంక నిదానించి చూశాను. చెట్టు ఆమె హృదయకుహరంలో ఏ వాణిని పలికించిందో, ఆమె ఆత్మ రూపం చూస్తూ- "ఊ", అన్నాను.

అని- "నేనెక్కడో వుంటాను. నాకెట్లా తెలుస్తుంది" సందేహం వెలిబుచ్చాను.

లేచి నుంచుంటూ అన్నది- "ఎట్లాగో తెలుస్తుందిలే చిన్నయ్యా"

* * *

రెండేళ్ళ తర్వాత నాకు నిజంగానే పిలుపు వచ్చింది. ఆరోజు రాత్రి ఎక్కడో పరరాష్ట్రంలో ఒక మిత్రుడి యింట్లో జిడ్డుక్రిష్ణమూర్తిగారి రికార్డు వింటూ కూచొనివున్నాను- నదీ తీరంలో ఒక చెట్టు చరిత్ర-ఆ యల్.పి.

మాడ్యూటీ ఆఫీసరు- ఆఫీసులో టెలిగ్రాం అందుకొని ఎక్కడెక్కడికో ఫోన్లు కొట్టి నా వునికిని కనుక్కొన్నాడు. తీగెల మీదే తంతిసారాంశాన్ని చదివి వినిపించాడు. ఆ అర్ధరాత్రే నా ప్రయాణం.

* * *

రత్తమ్మ అంత త్వరగా దేహ విసర్జన చేస్తుందని నాకనిపించలేదు. మాటల్లో స్పష్టత, చూపుల్లో నిశితత్వం చూసి ఎట్లా అనుకోను? దేహమే కొంచెం శుష్కించివున్నది.

దృశ్యమంతా అసత్యం, దృశ్యానికి ఆవల వున్నదే సత్యం అని కొద్ది క్షణాల్లోనే రత్తమ్మ మాటలు స్పష్టం చేశాయి.

"వచ్చావా చిన్నయ్యా, వస్తావని తెలుసు"

ఏమిటో ఓదార్చబోయాను. తను వినిపించుకోలేదు.

"నాకు స్త్రీధనం ఆస్తి వున్నది- పొలం. నువ్వు చదువుకున్న బడి కమిటీ వాళ్ళకు రాసేశాను. నీకేమీ లేదు"

"నాకెందుకు రత్తమ్మా. పెద్ద వుద్యోగంచేస్తున్నా"

"నా అస్థికల కోసం పెద్ద ఖర్చులకు పోమాక"

"డబ్బు సంగతి తేవద్దు. నీ కోరికేమిటో చెప్పు రత్తమ్మా. నా వుద్యోగం కాశీ దగ్గర. గంగానదిలో కలపనా?"

"వద్దు-చిన్నయ్యా. ఆ చెట్టంటే నాకు చాలా యిష్టం. శేషయ్య ఎక్కడైనా కనిపిస్తే నీదగ్గిరే వుంచుకో"

"మంచిది. నాతోనే వుంటాడు"

రత్తమ్మ బావలూ, మరుదులూ గొణుగుతున్నా నేను లక్ష్యపెట్టలేదు. ఆ సాయంత్రమే ఆమె ఖననం. అస్తి సంచయనం రోజున చెట్టు వేళ్ళ మధ్య పాదులు తీసి ఆ ఎరువు వేశాను. మా బంధువులు ముభావంగా వున్నా ఎవరూ ఆక్షేపించలేదు.

చెట్టు మీది పక్షులూ చెరువులో చేపలూ ఈ దృశ్యాన్ని చూసి వుండాలి. గూళ్ళకు తిరిగివచ్చిన పిట్టలు గుండెల్లో దిగులు రేపే విచిత్ర శబ్దాలేమీ చేయలేదు. వెన్నెల వచ్చిందాకా వుండి, ఆ రాత్రే నేను తిరుగు ప్రయాణం కట్టాను.

కాని మధ్యలో కథను చాలా భాగం, చెట్టుతో పెరిగిన నా అనుబంధం చెప్పటం మరిచి పోయాను.

* * *

నాన్న గతించిన నాలుగైదు ఏళ్ళలోనే-మేము దారిలేనిఎడారిలో. సంచరించవలసి వచ్చింది. ఉమ్మడి కుటుంబం విడిపోయింది. నాన్న చేసిన అప్పులన్నీ మా మీదనే పడ్డాయి. పొలం అమ్మి అమ్మ అప్పులు తీర్చేసింది.

ఆత్మ బంధువులుగూడా మా వునికినివట్టించుకోవటం మానివేశారు. అమ్మ కోమట్ల యింట్లో చిల్లర మల్లర పనులు చేస్తూవుండేది. అప్పుడే అడుగు పెట్టిన నా హైస్కూలు ప్రాంగణం,అప్పుడే మెళకువలో ప్రప్రథమ స్పందనం లాగా చిగురించిన నా సహాధ్యాయుల స్నేహ మాధుర్యం-నాకు దూరమై పోయాయ్.

మా గ్రామానికి పొరుగూరు వెల్లలూరుకూ-సరీగ్గా పొలిమేరలో నెలకొన్న కొత్త బియ్యం మిల్లులో కూలీగా చేరాను.

కూలి అంటే దినభత్యం, నెల జీతం లాంటిదిగాదు. మరలో ఒక పక్కగా విడిపోయి పడే తపుడును పోగుచేసి బస్తాలకెత్తటం. ఆ శ్రమకు ప్రతిఫలంగా వడ్లు మరవేయించుకున్న అసాములు- రెండు మూడు దోసిళ్ళ బియ్యం నా బుట్టలో వేసేవారు.

కాని యీ శ్రామిక జీవనమే-ఆ చెట్టుతో నాకు నిత్య సమ్మేళనానికి ప్రాతిపదిక అయింది. మిల్లునుంచి యింటికి పోతూ, దారిలో దూళినంతా చెట్టు

వద్ద చెరువులో శుభ్రపరచుకొనే వాణ్ణి. చెట్టుకింద నిర్వేదుడిగా బైరాయించే వాణ్ణి.

పోతూ పోతూ ఎండు చితుకులు ఏరుకొని చిన్నమూట కట్టుకొనేవాడిని. అమ్మ పొలాల్లో ఏరి తెచ్చిన ఎండు వరి మోళ్ళతో యీ సమిధెలు మిశ్రమమై యింట్లో పొయ్యి రాజుకొనేది.

ఈ ఎండు సమిధలా నాకూ చెట్టుకూ బాంధవ్యం? శేషయ్య స్నేహంలో కలిసిన నెయ్యం కాదా?- అన్న ఆలోచనలుగూడా వుద్భవించేవి.

ఎందరో పథికుల్ని మోసుకుపోయే ఎన్నో బళ్ళు-చెరువు తీరాన చెట్టు నీడలో నిలిచేవి. వాళ్ళంతా- ఏదో తృష్ణతో, వాంఛలతో సుఖ దుఃఖాల ప్రవాహాల్లో పయనిస్తూ, నీడకోసం విడిదిచేసి తరలిపోయే ప్రయాణీకులై తే- నేనెవరిని?

అప్పటివరకూ తన నుండి ఏమీ కోరిక, కాంక్షించక, ఏ అజ్ఞాత చిరంతన స్నేహం కోసమో, దాని నీడలో ఏ అభిమానంతో కూర్చొనేవాడినో, యీ చితుకుల వేటలో ఆ సహజ మాధుర్యం నశిస్తున్నదా? ఆనాటి నుంచే సమిధలు సేకరించటం మానివేసాను.

ఈ ఒక్క సంవత్సరంలోనే నా వయసెంత పెరిగిందోగాని, ఆలోచనలు మాత్రం అలలు, అలలుగా అలముకొనటం మాత్రం గ్రహించాను.

ఇంకొక విశేషం- ఆ చెట్టుకిందనే వుపవశించటం నేర్చుకొన్నాను.

తిండివేని రోజున క్షుద్బాధగాని, పిపాసగాని సోకకుండా-హోరున వీస్తున్న గాలిలో, వర్షకాభ్రమాల భయానకారవంలో, చెట్టులో ఒదిగి కూర్చొని స్పష్టా స్పష్టంగా వినవచ్చే బైరాగుల భజనావళిని వింటూనే- యింటికి పోయిన రోజున అమ్మ భయాందోళనతో అడిగిన ప్రశ్న: "నాయనా, ఆ చెట్టు వద్ద ఎప్పుడూ కూచుంటావని గురునాథం చెబుతున్నాడు. నిజమేనా?"

అమ్మకు ఏ అసత్యం చెప్పటం? అక్కడి ఏ అస్పష్ట అనుభవైక వేద్యాలయిన అద్భుత దృశ్యాలను వివరించటం? వైద్యశాలకు బండిలో పోతున్న యువతి-చివరి ప్రసవ వేదనతో, అక్కడే తన ప్రథమ శిశువును గాలివానలోనే వీక్షించిదని చెప్పనా? చాకలి యువతి వెంకటి అక్కడే ఆత్మ హత్య చేసుకొన్ననాడు ఆ చెట్టు మీద కోపగించుకొన్నానని చెప్పనా?

నాకే గోచరంకాని ఏ పదార్థంతో నువ్వూ మమేకమని ఏ సనాతన వివేకాన్ని బోధిస్తున్నదో నాకే అగ్రాహ్యం కదా. ఏమని చెప్పేది? ఏమని? ఏమీ చెప్పలేదు.

కాని నాకైతే మరునాడే, ఏ రహస్య కళాస్వరూపాన్ని అమ్మకు చెప్ప జాలకపోయానో, ఏ అనుభూతి స్వభావాన్ని అప్పటికీ యిప్పటికీ మాటల్లో చూపుల్లో వివరించలేక అశక్తుణ్ణిగా నిలబడిపోయానో- 'అది' అనుభవమయింది.

చీకటిపడుతున్న అసురసంధ్యవేళలో ఒక రెండెడ్ల బండి చెట్టు కింద దిగింది. పాంధులు సత్రం వేపు వెడుతున్నారు. ఎవరో మనిషి వునికిని గుర్తించి—

"బాబూ, యీ వూళ్ళో పాలెక్కడ దొరుకుతాయి?" అని ప్రశ్నించగానే నేను ముందుకు వచ్చాను.

"పాల చెంబు— వుందా?"

"ఆఁ ఇవిగో డబ్బులు. నీకు పుణ్యం"

"అక్కర్లేదండీ"

పావుగంటలో రత్తమ్మ పిండి యిచ్చిన పాలను తెచ్చి యిచ్చాను.

"ప్రతి మనిషి తనకున్నది యిస్తాడు. ప్రతిఫలంగా తీసుకొంటాడు. నువ్వు ఏమీ వద్దంటున్నావు. ఎవరు బాబూ నీవు?"

ఆయన గుచ్చి గుచ్చి నన్ను ప్రశ్నించాడు.

చివరికి నా చరిత్ర చెప్పాను.

* * *

ఆ మరుసటి దినమే నా కూలి జీవితాధ్యాయం ముగిసింది. తిరిగి విద్యార్థి దశ తొలకరించింది.

అమ్మ కన్నీటి ఆమోదంతోనే ఆయన నన్ను తమ వూరుకు తీసుకు పోయాడు. అక్కడ ఒక సంవత్సరంలోనే అప్పటి బెనారస్ మెట్రిక్యులేషన్ పరీక్ష పాసయినాను. తర్వాత వుపకార వేతనంతో కాలేజిలో గూడా ప్రవే శించాను. ఎఫ్.ఏ. అయిపోయింది. పట్ట పరీక్షగూడా సగంలో పడ్డది.

అమ్మ ఆరోగ్యం క్షీణిస్తున్నదని రెండు కబుర్లు అందినవి. అంతటితో నా విద్యార్థి జీవితం మళ్ళీ యింకో మలుపు తిరిగింది. చెట్టు కింద సునాయా సంగా వుపవశించే విద్య నాకేనాడు పట్టుబడ్డదో, ఆనాటి నుంచే ఏ లక్ష్యాన్న యినా, సంకల్పబలంతోనే సాధించ గలనన్న ఆత్మ స్థయిర్యం అలవడిందను కొంటాను.

ఎవరెంత చెప్పినా వినదలచుకోలేదు. ఇప్పుడొక్కటే లక్ష్యం. అమ్మను సేవించి రక్షించుకోవాలి. ఇంకొకటి- ఒక్క కరుణా దృష్టితోనే నాకు విద్యా

దానం చేసిన ఆయన రుణం తీర్చివేయాలి. దేనికయినా ధనలక్ష్మి కరుణ వుండాలి. అంటే వుద్యోగం. ఆ నిస్సంకోచ ఆత్మ విశ్వాసంతోనే యీ కొత్త లోకంలో పాదాలు మోపాను.

తన బాధలు, తన ఆవేదన ఒంటరిగా భరించిన అమ్మ పాదాలు స్పృశించాను.

యిన్నేళ్ళూ అడుగంటిపోయినవనుకొన్న తన లోపలి ఆశలూ– ఒక్కసారిగా ఆ స్పర్శతోనే చిగురించినట్లయి ఆమె కొద్దిరోజుల్లోనే కోలుకున్నది.

ఆ సాయంత్రం కొంచెంసేపు చెట్టుకింద కూచ్చున్నాను. విచిత్రంగా, అది ఆకు రాలే రుతువుకాకపోయినా, నా శిరస్సుమీద పండుటాకులు వర్షించినట్లయి పైకి చూశాను. వెంటనే నా రెండవ సంకల్పం స్మృతికి వచ్చింది,

అవును, నీ విద్యాదాత అప్పు ఎప్పుడు తీరుస్తావ్? "అప్పు తీరుస్తావు, సరే, ఆయన కరుణను గూడా రుణం కింద భావిస్తున్నావా?" ఎవరీ ప్రశ్నలు విసురుతున్నది- అని తలపోస్తూనే లేచాను.

నేను గృహప్రాంగణంలోకి అడుగుపెట్టే సరికి రత్తమ్మ అమ్మతో కబుర్లు చెబుతూ కనిపించింది.

"నీ కోసమే కూచున్నానయ్యా మన వూళ్ళో పాదిరీకి పాలు పోస్తుంటా గదా. వాళ్ళయిస్కోల్లో పంతులు పని వుందంట. నిన్ను కాయితాలు పెట్టమన్నాడు" అన్నది.

అప్పుడప్పుడే మా చుట్టుపక్కల గ్రామాల హరిజన వాడలన్నీ క్రిష్టియన్ వాడలుగా రూపుదాల్చు కుంటున్నవి. అన్ని వూళ్ళలోనూ చిన్న చిన్న చర్చీలు నిర్మిస్తున్నారు.

మా వూళ్ళో చిన్న స్కూలు గూడా చర్చి ఎదటనే స్థాపించారు. ఆ పాఠశాలలోనే నేనిప్పుడు అన్‌ట్రెయిన్డ్ టీచరుగా కుదురు కొన్నాను. అక్కడే నా తోటి వుపాధ్యాయిని గ్రేస్‌తో ప్రథమ పరిచయం.

* * *

గ్రేస్ జక్రియా నాకన్నా వయసులో కొంచెం పెద్దదే అయివుండాలి. కాని చాలా చిన్నదిగా కనపడేది. మనుషులకి అంత పెద్ద విస్ఫారిత నేత్రాలు అంత ఆరోగ్యం అంత సొగసు వుంటవా?- అనిపించేది. నా మాదిరిగా తనూ అన్‌ట్రెయిన్డ్ టీచరే.

అప్పట్లో స్త్రీ లెవరూ వేసుకోని గొడుగుపట్టి మత్తగజంలా నడిచి పోతుంటే వూరంతా విరగబడి చూచేవారు. ఈ బాధ పడలేక జక్రియా డొంక

దారిన నడచుకొంటూ పొరుగూరి నుంచి వచ్చేది. మళ్ళీ ఆ దారినే వెడలి పోయేది. ఆమెకు తోడుగా నేను వూరి పొలిమేరలదాకా వెంట వెళ్తుండేవాణ్ణి.

మధ్యలో చెట్టు కింద కొంత తడవు కూర్చొనేవాళ్ళం. అప్పుడనిపించేది, యీ సృష్టిలో ప్రకృతిలో చెట్టులాంటి అందమైన ఒక వ్యక్తితో నాకు స్నేహం కలిసిందని. ఆమె భావాలు నేనెప్పుడూ పరీక్షించి చూడలేదు. ప్రతి కదలిక లోనూ, ప్రతి పదోచ్చారణలోనూ ఏదో ప్రశాంతత, గంభీరత అదృశ్యమై వున్నదని భావించేవాణ్ణి.

కాని, ఆమె ఆ చెట్టు కింద నాతో సహ పంక్తిన కూచుంటున్నది నాతో పాటు ఆ గానం ఆ మనోహర శాంతి అనుభవించటానికేనా? స్పర్శ సుఖాన్ని- గాలినుండీ, ఆకుల గలగలనుండీ, చెర్లో ముడుచుకుపోతున్న తామరపూల కాడలనుండీ, దూరపు నక్షత్ర కాంతినుండీ, మబ్బు చాటునుండీ విస్తరిస్తూన్న చందమామ నుండీ కాక- నానుండే ఆశిస్తున్నదని తెలుసుకోవటానికి నాకు ఎన్ని నెలల దీర్ఘఅనుభవం కావలసి వచ్చిందో.

ఒక సాయంత్రపు ఏకాంతంలో ఆమె గబుక్కున నన్ను గట్టిగా ముద్దుపెట్టుకొన్నది. నా వడిని ఆక్రమించింది.

"మతంలో కలవ్వా? మనం పెళ్ళి చేసుకుందాం. ఇద్దరం ట్రైనింగుకు పోదాం. ఇక్కడే వుద్యోగాలు చేసుకుందాం" అని ఎంతో అనురక్తితో నన్ను వుక్కిరి బిక్కిరి చేసేసింది.

నా నుండి ఏ స్పందనలేక నివ్వెరపడిపోయి "ఏమిటాలోచిస్తున్నావ్?." అని కళ్ళలో కళ్ళుంచి చూసింది.

మళ్ళీ అడిగింది- ఒక్క క్షణం నిదానించి.

నేను కదలలేక మెదలలేక చెట్టుకేసి చూశాను.

"గ్రేసీ, యీ చెట్టుది ఏ మతం- అని ఆలోచిస్తున్నాను"

"యు ఆర్ ఏ ఫూల్"

"అవును గ్రేసీ, నాకు పెళ్ళి మీద వాంఛలేదు"

ఈ సంఘటన జరిగిన తర్వాత గూడా ఆమెకు తోడుగా వెళ్ళటం మాన లేదు. ఆమె మాత్రం చెట్టుకింద నాతోపాటు విశ్రమించటం మానివేసింది. మళ్ళీ నన్నెప్పుడూ స్పృశించలేదు.

* * *

అప్పుడే వచ్చింది రెండో ప్రపంచయుద్ధం. నా అప్పు తీరలేదు. నా ఆవేదన తీరలేదు. జపాను - ఫ్రెంచి, డచ్చి, బ్రిటిష్ సామ్రాజ్యాల వలస దేశాలన్నింటినీ కైవసం చేసుకొన్నది.

ఈ అదనులో నేను సైన్యంలో కమీషన్‌కు అప్లికేషన్ పెట్టాను. పిలుపూ, సెలెక్షనూ! మా మేనమామ వచ్చి అమ్మను వూరడించి తీసుకుపోయాడు.

నేను బయలుదేరుతున్న సమయంలో జక్రియా వచ్చి ఎదుట నిల్చింది. చెట్టుకింద.

"నన్ను క్షమించానని చెప్పు. నీకు వీడ్కోలు చెబుతాను'' అని నమ్రంగా నా చేతిని తాకింది.

"క్షమించవలసింది నువ్వు. ఇది వీడ్కోలు కాదు. మళ్ళీ కలుస్తాం. అప్పటికి నువ్వు హెడ్‌మిస్ట్రెస్‌గానో, ప్రిన్సిపాలిగానో నా అప్లికేషన్ తీసుకుంటావ్'' అన్నాను నేను వెళ్ళిపోతూనే.

ఎందుకన్నానో-! నాలుగేళ్ళ తర్వాత నేను బర్మా యుద్ధం ముగిసాక సైన్యం నుండి విడుదల పొంది స్వదేశమార్గంలో వుండగా అలహాబాద్ స్టేషన్‌లో ఒంటరిగా, దీనురాలై, తను ప్రేమించినవాడి మోసానికి గురియై కట్టుబట్టల్తో నిలిచి కన్పించింది. నేవీలో ఆఫీసరట.

ఇంటికి రానన్నది. వాణ్ణి పట్టి పగ తీర్చుకొంటానన్నది. ససేమిరా వినలేదు. బ్రతిమిలాడినా లాభంలేకపోయింది. రెండు చీరెలు కొనిపెట్టు. చాలు- అన్నది.

బజారుకు వెళ్ళాం. బలవంతాన అరడజను చీరెలూ, సూట్‌కేసూ, స్లిప్పర్లూ కొని యిచ్చాను. నా పర్సులో సగం నోట్లు ఆమెను బలవంతంగా తీసుకొనేట్లు ప్రాధేయపడ్డాను.

"గ్రేసీ, మనమిద్దరం మన పూళ్ళో చెట్టు కింద వేర్వేరు సంగీతాలు విన్నాం. నా పాటను నీకు వినిపించాలని ప్రయత్నించాను. సాధ్యపడలేదు''

ఏడవలేదు. చాలా గంభీరంగా నా చేతిని తాకింది.

ఊరు చేరినాక ఆమె సంగతి పాదిరీకి నివేదించాను. "బాబూ, బైబిల్ కథ స్మృతికి తెచ్చావ్. ఆమెను క్రీస్తుప్రభువే రక్షిస్తాడు. నీవు దిగులుపడకు" అన్నాడు. ఆమెను మళ్ళీ నేనెప్పుడూ చూడలేదు.

* * *

యుద్ధ సర్వీసువల్ల వుద్యోగం మంచిదే దొరికింది నాకు. ప్రమోషన్లు గూడా త్వర త్వరగా లభించాయి. అమ్మ కోరినట్లుగా వివాహం చేసుకొన్నాను. నా పిల్లలూ చదువుకొని రెక్కలు తెచ్చుకొన్నారు.

ఇప్పుడు నా అవసరం తీరిపోయింది. రత్తమ్మ రుణం, నా విద్యాదాత రుణం ఎప్పుడో తీరిపోయినవి. అమ్మ గూడా ప్రశాంతంగానే బ్రహ్మ పదార్థంలో కలిసి పోయింది.

కాని గురు రుణం తీరలేదు. గురువులు ఆరు రకాలని పెద్దలు వుద్ఘాటిస్తున్నారు- ప్రేరక, సూచక, వాచక, దర్శక, శిక్షక, బోధకులనీ.

ఈ షడ్గురువులూ ఒకే మూర్తిలో దర్శన మిచ్చిన, ఆ చెట్టును, నా సర్వీసంతా వుత్తరాదినే గడపటంలో, మళ్ళీ చూడటం పడలేదు.

ఇప్పుడు- రిటైర్ అయి, వానప్రస్థాశ్రమంలో అడుగిడుతూ మొదట ఏ గురువును సంస్మరించను? ఆ గురుదర్శనానికే యీ నా పయనం.

నా భార్య వారించింది. నాకు పెళ్ళి 'అరణంగా' వచ్చిన మా పిన్నత్త గారు వ్యంగ్య వ్యాఖ్యానం చేసింది.

"ఆ యిల్లు ఎప్పుడో చవుడు పట్టి పోయింది. మిమ్మల్నెవరు గుర్తు పడ్తారు? ఎక్కడ తింటారు?" అన్నది నా సహధర్మచారిణి.

"ఇంటి కోసం కాదే పిల్లా. మీ అయన ఏదో చెట్టుకోసం వెడుతున్నాడే. ఆ వంశంలోవున్న అనవాయితేనే- ఎందుకు ఆపుతావు" అన్నది పిన్నత్త గారు.

ఆమె విసురు మా తాతగారి మీద ధాత కరువు రోజుల్లో ఆయన చెట్ల మేస్త్రీగా వుండి ట్రంకు రోడ్డులో చాలా వృక్షాలకు పాదులు తీయించి, నాటించాడట. నీరు లేకుండా బతికే చెట్లు.

* * *

ఒక పగలూ, ఒక రాత్రి ప్రయాణం చేసి, ఒక లారీవాని ధర్మమా అని అర్ధరాత్రికి మా గ్రామం చేరాను. మా యిల్లు చవుడుపట్ట లేదను కొంటాను.

కాపరం వుంటున్న కాంతయ్యా మాస్టర్‌గారు అప్పటికప్పుడు నాకు పక్క అమర్చారు. మనవడి కోసం వుంచిన పాలతో కాఫీ కప్పు అందించారు. యాదమరచి నిద్రించానేమో తెల్లారి చాలా అలస్యంగా మెళకువ వచ్చింది.

మొదటి స్పందనతోనో, చెరువుకేసి బయలుదేరాను. ఏదో కొత్త ప్రదేశంలో నడుస్తున్నట్లుగా భావన కలిగి తిరిగి చూశాను. అదే దారి. అదే వీధి. అవే అరుగులు, అయితే ముఖాలు కొత్త. గోడలు పాత.

నేనక్కడకు చేరేసరికి- చెట్టు కనిపించ లేదు. చెట్టు, చెట్టు ఏమయింది? అక్కడ కనిపించిన మొదటి వ్యక్తిని ఆపి ఆ ప్రశ్నే వేశాను.

"ఏ సెట్టు?"

"అదే. యిక్కడుండేది పెద్ద చెట్టు. ఒక వైపున వూడలూ-"

"ఓ ఆ సెట్టా? దాన్నెప్పుడో కొట్టేశారయ్యా. - అయ్యగోరూ. మీకు తెలవదా- యీ సెరువంతా యీకర్ సెక్చనోళ్ళ యిండ్లకు పట్టాలిస్తిరి గదా"

అప్పుడు చూచాను. చెరువు సగం పూడిపోయి వున్నది. అక్కడక్కడా గుడిశెలూ లేచినై.

"ఇంకెక్కడా స్థలం దొరకలేదా?"

"దొరక్కేం. బోలెడంత. కట్టుకుపోయినంతుంది మరి మా వూళ్ళో ఫ్యాక్టీలు కదండీ" అన్నాడు.

తిరుగు ప్రయాణంలో ప్లాట్‌ఫారం మీద యీ పత్రిక కొన్నాను. దీంట్లో మొదటి కవితే సింధీ కవి గేయం. ప్రథమంలో వుదహరించాను- దయ చేసి తిరిగి పఠించండి. ○

(స్వాతి మాసపత్రిక)